

రైల్వేస్టేషన్లను సందర్శించిన డీఆర్ఎం



పెద్దపల్లి రైల్వే జంక్షన్ పరిశీలిస్తున్న రైల్వే డీఆర్ఎం ఆర్ గోపాలకృష్ణన్

పెద్దపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి రైల్వే జంక్షన్‌తోపాటు బైపాస్ స్టేషన్‌ను మంగళవారం దక్షిణ మధ్య రైల్వే జోన్ సికింద్రాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్ గోపాలకృష్ణన్ సందర్శించారు. స్టేషన్ ఆధునికీకరణ పనులను పరిశీలించారు. పనులను వేగవంతంగా చేప ట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం జరుగు తుండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నూతన బైపాస్ రైల్వే క్యాబిన్‌ను పరిశీలించారు. పెద్దపల్లి జంక్షన్‌లో 12643/44 తిరువనంతపురం స్వర్ణజయంతి వీక్లీ, 12252/51 వైన్ గంగా బై వీక్లీ ఎక్స్‌ప్రెస్, 16367/68 కాశీ తమిళ సంగమం వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలని ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం సభ్యుడు జాన్ వెస్లీ డీఆర్ఎంకు ఇచ్చిన వినతి పత్రంలో కోరారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): ఓదెల రైల్వేస్టేషన్ మౌలిక వసతులపై సౌత్ సెంట్రల్ రైల్వే డీఆర్ఎం డా.ఆర్.గోపాలకృష్ణన్ పరిశీలించారు. రైల్వే స్టేషన్‌ను సందర్శించిన ఆయన రెండు ప్లాట్‌ఫామ్‌లపై ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, ప్రయాణికులకు నీడ కోసం షెడ్ల నిర్మాణం పరిశీలించారు. గేటు వద్ద ఉన్న సమస్యలను సిబ్బందిని తెలుసుకున్నారు. వాహనాల పార్కింగ్, రిజర్వేషన్ కౌంటర్ పరిశీలించారు. ఓదెల రైల్వేస్టేషన్‌లో దానాపూర్, తిరుమల తిరుపతి, అండమాన్, లక్నో, ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని బీజేపీ నాయకులు కోరారు. రైల్వేస్టేషన్‌లో రెండు వైపులా ప్లాట్‌ఫామ్‌ల మర మ్మతు, అండర్ బ్రిడ్జి వరకు 32 ఫీట్ల సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. అండర్ బ్రిడ్జి కింద నీరు నిలిచి వాహనదారులు, రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, అండర్ బ్రిడ్జి కింద నీటి నిల్వలు ఉండకుండా పనులు చేపట్టాలని పేర్కొన్నారు. అధికారులు, అభిరామ్, సుశాంత్ కుమార్, శ్రీవాస్తవ, విశ్వేశ్వర్‌రావు పాల్గొన్నారు. డీఆర్ఎంకు బీజేపీ నాయకులు కారెంగుల శ్రీనివాస్, తీర్థాల కుమారస్వామి, రాకేష్, మేర్గు రంగయ్య, రామినేని రాజేంద్రప్రసాద్, శాతాళ్లకుమార్, కృష్ణమాచారి, వెంకటేశ్వర్లు, అశోక్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



డీఆర్ఎంకు ఓదెల మల్లికార్జునస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఖని జనరల్ ఆసుపత్రి ఆర్ఎంవోగా కృపాబాయి



కళ్యాణ్‌నగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆర్ఎంవోగా పీ కృపాబాయిని నియమిస్తూ మంగళవారం హెల్త్, మెడికల్, ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రధాన కార్యదర్శి క్రిస్టానియా జెడ్ చుంగ్ ఆదేశాలను జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 36మందిని నియమిస్తూ ఆదేశా లు జారీ చేయగా, గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి కృపాబాయిని నియ మించారు. కృపాబాయి గతంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పని చేయగా, కొంత కాలంగా మంచిర్యాలలో పని చేస్తున్న ఆమెకు ఈ పోస్టింగ్ ఇచ్చారు.

పెద్దపల్లి మార్కెట్‌లో రూ. 6858 పలికిన పత్తి ధర

పెద్దపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి క్వింటాలుకు అత్యధికంగా 6,858 రూపాయల ధర పలికింది. మంగవారం మార్కెట్‌కు 457 మంది రైతులు 1422 సంచుల్లో 1279.80 క్వింటాళ్ల పత్తిని తీసుక వచ్చారు. క్వింటాలు పత్తికిగరిష్టంగా 6,858, కనిష్ఠంగా 5,571, మోడల్ ధర 6,571 రూపాయలు పలికింది. సీసీఐ కొనుగోళ్లు జరగలేదు.

పనులు ప్రారంభించని ఇందిరమ్మ ఇళ్ల రద్దు

- 13 పైలట్ గ్రామాల్లో 1951 ఇళ్లు మంజూరు
- జిల్లాలో 1017 ఇందిరమ్మ ఇళ్ల రద్దు
- ఎనిమిది నెలలైనా ఆరంభించక పోవడమే కారణం
- వాటి స్థానంలో ఇతరులకు మంజూరు



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ప్రభుత్వం చెక్ పెట్టింది. నిర్ణీత గడువు లోపు ఇళ్ల నిర్మాణాలు చేపట్టని ఇళ్లను రద్దు చేసి అర్హులైన ఇతరులకు మంజూరు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో జిల్లాలో రద్దు ప్రక్రియను ఆరంభించారు. మొదటి విడత మంజూరు చేసిన ఇళ్లలో ఇప్పటి వరకు 1017 ఇళ్లకు పైగా రద్దు చేశారు. వాటి స్థానంలో అర్హులైన జాబితాలో ఎమ్మెల్యేలు సూచించిన వారికి ఇళ్లను మంజూరు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుక వచ్చిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో కేవలం డబుల్ బెడ్ రూముల ఇళ్లను మాత్రమే మంజూరు చేసినప్పటికీ, వాటిని నిర్మించేందుకు కాంట్రాక్టర్లు పెద్దగా ముందుకు రాకపోవడంతో కేవలం కొన్ని చోట్ల మాత్రమే ఇళ్లు పూర్తయ్యాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంథనిలో 74 మంది లబ్ధిదారులకు ఇళ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని చందపల్లి, రాంపెల్లి వద్ద నిర్మించిన ఇళ్లకు మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల్లో పూర్తయిన ఇళ్ల ప్రాంగణాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో భాగంగా ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున కేటాయించింది. అందులో భాగంగా పెద్దపల్లి నియోజక వర్గంలో 3.330 ఇళ్లు మంజూరు చేశారు. రామగుండం నియోజకవర్గంలో 1600 ఇళ్లు మాత్రమే మంజూరు చేశారు. మంథని నియోజకవర్గంలోని జిల్లాలో గల నాలుగు మండలాలకు 1750 ఇళ్లు కేటాయించగా, ఇప్పటి వరకు 900 ఇళ్లు మంజూరు చేశారు. ధర్మపురి నియోజకవర్గం పరిధిలో గల ధర్మారం మండలానికి 676 ఇళ్లు కేటాయించగా, మొత్తం మంజూరు చేశారు. మంజూరు చేసిన ఇళ్లలో 4,297 ఇళ్లకు సంబంధిత హౌజింగ్ అధికారులు మార్కవుట్ చేయగా, 3,089 ఇళ్లు ప్రగతిలో ఉన్నాయి. ఇందులో 1,741 ఇళ్లు బేస్‌మెంట్ లెవెల్‌లో, 651 ఇళ్లు లెంటల్ లెవెల్‌లో, 668 ఇళ్లు స్లాబ్ లెవెల్‌లో నిర్మాణంలో ఉండగా, 23 ఇళ్లు పూర్తయ్యాయి.

● గడువు మీరిన ఇళ్ల మంజూరు రద్దు...

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు జారీ చేసి, అధికారులు

(మిగతా 6వ పేజీలో)

మూడు రోజులు పత్తి కొనుగోళ్లు నిలిపివేత



అధికారులు, జిన్నింగ్ మిల్లు వ్యాపారులతో కలెక్టర్ సమావేశం

పెద్దపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పాటు జిల్లాలోని మార్కెట్ యార్డులు, సీసీఐ కేంద్రాలకు పత్తి తీసుకురావద్దని కలెక్టర్ కోయ శ్రీహర్ష రైతులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో పత్తి కొనుగోళ్లపై నిర్వహించిన సమావేశంలో మాటాడుతూ పత్తి జిన్నింగ్ మిల్లు అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని జిన్నింగ్ మిల్లర్లు, సీసీఐ, ప్రైవేటు కొనుగోలు నిలిపివేస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు రైతులు మార్కెట్‌కు, జిన్నింగ్ మిల్లు వద్దకు పత్తి తీసుకురావద్దన్నారు.

సీసీఐ విధించిన నిబంధనలో ఎల్1, ఎల్2, ఎల్3 విధానం పక్క జిల్లాల రైతులను అనుమతించడం, పత్తి రైతు ఎకరానికి 7 క్వింటాలు అమ్ముకునే వీలు కల్పించే విషయంలో వెసలుబాటు కల్పించే వరకు కొనుగోలు నిలిపేస్తున్నామని జిన్నింగ్ మిల్లు అసోసియేషన్ ప్రకటించిందన్నారు. జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, కాటన్ మార్కెట్ కమిటీ కార్యదర్శులు, పోలీస్, రవాణా, అగ్నిమాపక శాఖ సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

పెండింగ్ సీఎంఆర్ రైస్‌ను 8వ తేదీలోగా పూర్తి చేయాలి

గతేడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పెండింగ్ సీఎంఆర్ రైస్ డెలివరీ ఈనెల 8వ తేదీ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ కోయశ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఖరీఫ్ 2024 సీజన్‌కు సంబంధించి 99.5 శాతం డెలివరీ పూర్తి చేసి రాష్ట్రంలోనే పెద్దపల్లి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. జిల్లాలోని 11 రైస్ మిల్లుల పరిధిలో మరో 29 ఏసీకే రైస్ సరఫరా పెండింగ్ ఉందని, పెండింగ్ రైస్ డెలివరీ కూడా గడువు లోగా పూర్తి చేయాలన్నారు. రబీకి సంబంధించి రైస్ డెలివరీ కూడా గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ ధాన్యం కేటాయింపునకు బ్యాంకు గ్యారంటీ అందించడం తప్పనిసరని కలెక్టర్ తెలిపారు. మిల్లర్లందరు తప్పనిసరిగా బ్యాంకు గ్యారంటీ సమర్పించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, మేనేజర్ శ్రీకాంత్, రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వరి కోతకు గంటకు రూ.3500
రైతులను దోచుకుంటున్న దళారులు

పెద్దపల్లి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వచ్చిన తుఫాన్, ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల రైతులు పండించిన పంటను కాపాడుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో చైన్ హార్వేస్టర్‌లను తీసుకొస్తున్న మధ్య దళారులు వరి పంటను కోసేందుకు రైతుల నుంచి అధికమొత్తంలో డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని గ్రామాల్లో కురిసిన వర్షానికి పంట పొలాల్లో నీరు చేరడంతో టైర్లు ఉన్న హార్వెస్టర్‌తో కోయలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో చైన్ మిషన్ తీసుకొచ్చిన దళారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో అదే ఆసరాగా చూస్తున్న దళారులు గంటకు రూ.3500ల చొప్పున ఇష్టారాజ్యంగా ధరలను పెంచి వసూలు చేస్తున్నారు. రైతులు పంటను కాపాడుకునేందుకు విధిలేని పరిస్థి తుల్లో వేలాది రూపాయలను ఇస్తున్నారు. మండలం లోని అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి రైతుల నుంచి అధికంగా దోచుకుంటున్న వారి చర్యలకు అడ్డుకట్ట వేయాలని మండల రైతులు కోరుతున్నారు.

తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు



కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు జరుగుతున్న పనులు

పెద్దపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసేందుకు పనులు చేపడుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ తల్లి విగ్రహం రూపురేఖలను మార్చిన విషయం తెలిసిందే. ఆ మేరకు అంబేద్కర్ సచివాలయం ఆవరణలో కూడా విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అన్ని జిల్లా కలెక్టరేట్లలో తెలంగాణ తల్లి విగ్రహాలను ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశించింది. దీంతో కలెక్టరేట్ ఆవరణలో విగ్రహం ఏర్పాటుకు గద్దె నిర్మాణం చేపడుతున్నారు.

కన్నుల పండువగా లక్ష దీపారాధన



శివాలయంలో లక్ష దీపారాధన మహోత్సవం భక్తులు

కోల్‌సిటీటౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మార్కండేయకాలనీలోని శివాలయంలో లక్ష దీపారాధన మహోత్సవం మంగళవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మంచికట్ల బిక్షపతి ఆధ్వర్యంలో జరిగిన మహోత్సవంలో ఆలయ ప్రధాన అర్చకులు రాఘవా చార్యులు, అర్చకులు శ్రావణ్‌కుమార్, సత్యనారా యణలచే రుద్రాభిషేకం, లింగోద్భవం, జ్యోతి ప్రజ్వలన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. కాంగ్రెస్ మాజీ ఫ్లోర్‌లీడర్ మహంకాళి స్వామి, ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి బండారి రాజమల్లు, కోశాధికారి గడ్డం రవి, కొండి లక్ష్మీపతి, కొక్కిరాల శ్రీనివాస్, సభ్యులు తాటిపాముల రాజేష్, లెంకల రాజిరెడ్డి, తోకల మల్లయ్య వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు కార్తీక పౌర్ణమి..

- నదీ స్నానాలు... ఆలయాల్లో పూజలు
- మార్కెట్‌లో రద్దీ



పెద్దపల్లి కల్చరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని బుధవారం జరుపుకోవడానికి ప్రజలు సిద్ధమవుతున్నారు. పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మంగళవారం మార్కెట్లలో సందడి నెలకొంది. జిల్లా కేంద్రంలోని జెండా కూడలి వద్ద పూలు, పూజా సామాగ్రి విక్రయిస్తున్నారు. నదీ స్నానాలు ఆలయాల్లో పూజలు దీపావళి రోజు కేదారేశ్వర వ్రతాలు నోచుకోని వారు పౌర్ణమి రోజు జరుపుకొంటారు. కార్తీక మాసంలో నది స్నానం, దీపారాధన కూడా విశేష ఫలితాలను తీసుకువస్తాయని పండితులు చెబుతుంటారు. కార్తీక పౌర్ణమి రోజు భక్తి శ్రద్ధలతో వ్రతాలు, నోములు ఆచరిస్తారు. కార్తీక పౌర్ణమి రోజున త్రిపు రాసురుడు అనే రాక్షసుడని శివుడు సంహరించాడని, రాక్షసుడి దురాగతాల నుంచి దేవతలకు విముక్తి కల్పించాడని పురాణ కథ. దీంతో దేవత లందరూ సంతోషంతో శివుడికి దీపాలు వెలిగించారు. పౌర్ణమి రోజున చేసే దీపారాధనకు ఎంతో విశిష్టత ఉంది. ఈ రోజున తుల సి, రావి చెట్ల ముందు దీపదానం చేస్తే సంతోషం, శ్రేయస్సు, శాంతి కలుగుతాయి. కార్తీక పౌర్ణమి నాడు ఉసిరి చెట్ల కింద వనభోజనాలు చేయడం ఆచారంగా వస్తున్నది. నదిలో దీపాలను దానం చేస్తే మంచిది. అలా కుదరకపోతే ఆలయంలో దీపాన్ని దానం చేయాలని పండితులు చెబుతున్నారు. విష్ణు సహస్రనామ పారాయణం చేస్తే మంచి జరుగుతుందని అంటారు. చంద్రుడికి పచ్చిపాలను నీటిలో కలిపి అర్పిస్తే విశేష ఫలితాలను పొందవచ్చు. గోదానం చేయడం కూడా మంచి ఫలితాన్ని ఇస్తుంది. బెల్లం, దుస్తులు తదితర వాటిని పేదలకు దానం చేస్తే శుభం జరుగుతుంది. మట్టి దీపాలు లేదా పిండి దీపాలను వెలిగిస్తే ఎంతో పుణ్యం కలుగుతుంది. పిండి దీపాలను వెలిగించాలంటే ఐదు లేదా 7 దీపాలను వెలగించవచ్చు. కొబ్బరి దీపాన్ని కూడా ఈ దీపాలతో పాటుగా వెలిగించండి.

● 365 వత్తులు...

కార్తీ పౌర్ణమి నాడు చాలా మంది 365 వత్తులతో కూడిన దీపాన్ని వెలిగిస్తారు. అలాగే 365 వత్తులు వెలిగించడం వల్ల సంవత్సరంలో ఏ ఒక్క రోజు దీపం వెలిగించకపోయినా కోల్పోయిన పుణ్యాన్ని తిరిగి పొందవచ్చు. కార్తీక పౌర్ణమి నాడు లక్ష్మీదేవిని ఆరాధిస్తే కూడా మంచి జరుగుతుంది. నారాయణుడిని, శివుడిని కలిసి పూజిస్తే విశేష ఫలితాలను పొందవచ్చు.

● పౌర్ణమి తిథి ఎప్పటి నుంచి మొదలవుతుంది...

కార్తీక పౌర్ణమి ఈ నెల 4న రాత్రి 10.40 నుంచి మొదలుకొని 5వ తేది సాయంత్రం 7 గంటల వరకు ఉంటుంది. ఉదయ తిథి ప్రకారం చేసుకోవాలి. కనుక 5న కార్తీక పౌర్ణమిని జరుపుకోవాలి. కార్తీక పౌర్ణమి నాడు నారికేళ దీపాన్ని వెలిగిస్తే మంచిది.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి
జాతీయ మాజీ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

గోదావరిఖని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల కోసం, స్వాతంత్ర్య సాధన కోసం పోరాడిన భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) డిసెంబర్ 26న శత వసంతాల సందర్భంగా ఖమ్మంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామని ఆ పార్టీ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశం కే కనకరాజు అధ్యక్షతన గోదావరిఖని భాస్కరరావు భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా చాడ వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కలవేన శంకర్ హాజరై మాట్లాడారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదిలాబాద్ జోడేఘాట్ నుంచి జీపుజాతా ప్రారంభమై రాష్ట్రమంతా నిర్వహిస్తామన్నారు. ఈనెల 16న గోదావరిఖని, పెద్దపల్లి, సుల్తానాబాద్ ప్రాంతాలకు వస్తుందని, పార్టీ కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నదని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో నిధులను అదానీ, అంబానీల జేబు సంస్థలుగా మారుస్తున్న కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని వారన్నారు. బీహార్ ఎన్నికలు దేశ రాజకీయ ఒక చిత్రాన్ని మారుస్తాయని అభిప్రాయపడ్డారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, రాష్ట్ర సమితి సభ్యులు గౌతమ్ గోవర్ధన్, గోషిక మోహన్, నాయకులు కదారి సునీల్, తాళ్లపల్లి మల్లయ్య, మడ్డి ఎల్లయ్య, సూర్య, తాళ్లపల్లి లక్ష్మణ్, వైవీ రావు, మాటేటి శంకర్, రామచందర్, రవీందర్, ఆరెపల్లి మానస్ కుమార్, లెనిన్, ప్రీతం, కల్లెపల్లి నవీన్, చంద్రశేఖర్, పాల్గొన్నారు.

సాయికృష్ణ మృతదేహం లభ్యం
అన్నారం బ్యారేజీ నీటి ప్రవాహంలో గుర్తింపు 4లో

జాతీయ రహదారిపై కారు బీభత్సం

● తప్పిన ప్రమాదం



శంకరపట్నంలో షాపులోకి దూసుకెళ్లిన కారు

శంకరపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండల కేంద్రంలో జాతీయ రహదారిపై కారు బీభత్సం సృష్టించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు వెళ్తున్న కారు కేశవపట్నం రాగానే రహదారి పక్కకు దూసుకెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి పక్కన ఉన్న షాపుల్లోకి దూసుకెళ్లింది. కారు వేగంగా దూసుకెళ్లడంతో విద్యుత్ స్తంభం విరిగింది. విద్యుత్ వైర్లు తెగి కింద పడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అంతటితో ఆగకుండా పక్కన ఉన్న కిరాణం, స్వీట్ హౌస్ షాపులోకి దూసుకెళ్లింది. కారు ఢీ కొట్టడంతో షాపుల ముందు ఉన్న ద్విచక్ర వాహనం ఇతర సామగ్రి ధ్వంసమైంది. రోడ్డుపై ప్రజలు ఎవరూ లేకపోవడం వల్ల పెను ప్రమాదం తప్పింది. కారు బెలూన్లు తెరుచుకోవడంతో కారులో ఉన్న వారు సురక్షితంగా బయటపడ్డట్లు స్థానికులు తెలిపారు.

కారును ఢీ కొన్న డీసీఎం వ్యాన్

శంకరపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ శివారులో కారును వెనుక నుంచి డీసీఎం వ్యాన్ ఢీకొన్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు వెళ్తున్న కారును మొలంగూర్ ఎక్స్‌రోడ్ అండర్ పాస్ వద్ద డీసీఎం వ్యాన్ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు వెనుక భాగం పాక్షికంగా ధ్వంసమైంది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరికి గాయాలు

వేములవాడ రూరల్ నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. చందుర్తి మండలం మూడపల్లి గ్రామం చెందిన సంటి దేవయ్య అనే వ్యక్తి పనిపై హన్మాజీపేటకు వచ్చి తిరిగి మూడపల్లికి వెళుతుండగా ఎదురుగా మరొక ద్విచక్ర వాహనం ఢీకొనడంతో దేవయ్యకు గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం వేములవాడలోని ఏరియా ఆసుపత్రికి రుద్రంగి ఈఎంటి ప్రశాంత్‌కుమార్, పైలెట్ నరేందర్ తరలించారు.

అరకొర వసతులతో ఇక్కట్లు

- కోరుట్ల ఆసుపత్రిని 100 పడకలుగా అప్‌గ్రేడ్ చేసినా ఫలితం శూన్యం
- వేధిస్తున్న వైద్యుల కొరత
- అల్ట్రాసౌండ్ స్కానింగ్ లేక గర్భిణుల అవస్థలు



కోరుట్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి



నిరుపయోగంగా మారిన ఆక్సిజన్ ప్లాంట్

కోరుట్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోరుట్లలో పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు గత ప్రభుత్వం 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినా అరకొర వసతులతో ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదు. ఆసుపత్రిలో అత్యవసర వైద్యసేవలు అందకపోవడంతో క్షతగాత్రులు జగిత్యాల, కరీంనగర్, నిజామాబాద్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న క్రమంలో మృతిచెందిన సందర్భాలు ఉన్నాయి.

● రూ.12.50 కోట్లతో ఏరియా ఆసుపత్రి అప్‌గ్రేడ్

కోరుట్ల నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా గత ప్రభుత్వం రూ.12.50 కోట్ల నిధులతో 100 పడుకల ఆసుపత్రిగా మార్చేందుకు భవన నిర్మాణం చేసింది. పట్టణంలో జీ ప్లస్ త్రీ భవన సముదాయాన్ని నిర్మించారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి మంత్రి తన్నీర్ హరీ‌ష్‌రావు చేతుల మీదుగా అప్పటి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఆధ్వర్యంలో 100పడకల ఆసుపత్రిని ప్రారంభింపజేశారు.

● ముఖ్యమైన విభాగాలకు వైద్యులు కరువు

ఏరియా ఆసుపత్రిలో 28 మంది వైద్యులు కావాల్సి ఉండగా 15 మంది వైద్యులు మాత్రమే ఉన్నారు. ఆసుపత్రిలో ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, అదనపు గైనకాలజిస్ట్ అవసరం ఉంది. ఉన్న డాక్టర్లకు సరైన వైద్య పరికరాలు అందుబాటులో లేకపోవడంతో ప్రాథమిక చికిత్స మాత్రమే నిర్వహిస్తున్నారు. కొత్తగా టీ హబ్ ఏర్పాటు చేసి 130 పరీక్షలు చేస్తున్నా స్టేషనరీ కొరత కారణంగా రోగుల సెల్‌ఫోన్లకు వైద్యసిబ్బంది రిపోర్టులను పంపుతున్నారు.

● ప్రతి రోజు 400కు పైగా ఓపీ

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి రోజు 400కు పైగా రోగులు వైద్య పరీక్షలకు వస్తున్నారు. గర్భిణులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రిలో స్కానింగ్ మిషన్ లేకపోవడంతో గర్భిణులు ప్రైవేట్‌కు వెళ్లాల్సి వస్తోంది.

● మూలనపడిన వైద్య పరికరాలు

సిబ్బంది కొరతతో ప్రభుత్వం మంజూరు చేసిన వైద్య పరికరాలు మూలన పడ్డాయి. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు అందించే ఆక్సిజన్ పీఎస్ఏ ప్లాంట్, ప్రాక్చర్‌లను గుర్తించేందుకు ఉపయోగించే సీ-ఆర్మ్ ఎక్స్‌రే ఆర్థోమిషన్ నిరుపయోగంగా మారాయి. రూ.25 లక్షల విలువైన ఆక్సిజన్ పరికరాలు దవాఖాన ఆవరణలో ఉండడంతో అవి తుప్పపడి పోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు శ్రద్ధ చూపి ఏరియా ఆసుపత్రిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి పేద ప్రజలకు వైద్య సేవలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదికలు పంపాం

- సునితారాణి,సూపరింటెండెంట్, కోరుట్ల ఏరియా ఆసుపత్రి



ఏరియా ఆసుపత్రి అవసరాలపై వైద్య శాఖ ఉన్నతాధికారులతో పాటు ప్రభుత్వానికి నివేదికలను పంపించాం. ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్న సిబ్బందితో అన్ని రకాల వైద్యసేవలను అందిస్తున్నాం.

మౌలిక వసతులు కల్పించాలి

-పెండం గణేష్, బీజేపీ మాజీ కౌన్సిలర్,



పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించి నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించాలి. ఆసుపత్రిని 30 పడకల నుంచి వంద పడకలుగా మార్చినా పూర్తి స్థాయిలో వైద్యులను నియమిస్తేనే పేదలకు మెరుగైన వైద్యం అందుతుంది.

బహ్రెయిన్‌లో అంత్యక్రియల నిర్వహణకు అంగీకార పత్రం

ఇబ్రహీంపట్నం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): బహ్రెయిన్‌లో మృతిచెందిన గల్ఫ్ కార్మికుడు శ్రీపాద నరేష్ అంత్యక్రియలు అక్కడే నిర్వహించేందుకు మృతుడి భార్య అంగీకారం పత్రాన్ని సీఎం ప్రవాసి ప్రజావాణిలో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కు మంగళవారం అందించారు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన గల్ఫ్ కార్మికుడు శ్రీపాద నరేష్ ఐదేళ్ల క్రితం బహ్రెయిన్‌లో మృతిచెందాడు. ఈ మేరకు ఆయన మృతదేహం అక్కడే భద్రపరచగా, ఇక్కడికి తీసుకువచ్చేందుకు వీలు లేకుండా పోయింది. దీంతో అక్కడే అంత్యక్రియలు నిర్వహించేందుకు అంగీకారం పత్రం మీద నరేష్ భార్య లత సంతకం చేశారు. కార్యక్రమంలో ఎన్నారై అడ్వయిజరీ కమిటీ సభ్యులు నండి దేవేందర్ రెడ్డి, సింగిరెడ్డి నరేష్ రెడ్డి, సామాజిక సేవకులు మొరపు తేజ, ఆకుల ప్రవీణ్, బొజ్జ అమరేందర్ పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుడి అరెస్ట్

ధర్మపురి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలం రామయ్యపల్లె గ్రామంలో పరమాల భీమయ్య అనే వ్యక్తిపై గొడ్డలితో దాడి చేసిన కేసులో నిందితుడు పందిరి భీమయ్యను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ గ్రామానికి చెందిన పందిరి భీమయ్య ఈ నెల1న పరమాల భీమయ్యపై గొడ్డలితో దాడిచేసి చంపే ప్రయత్నం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 3న ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు పందిరి భీమయ్యను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

శతాధిక వృద్ధురాలు మృతి

ఎల్లారెడ్డిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్‌లో శతాధిక వృద్ధురాలు చెట్టిపల్లి లక్ష్మమ్మ(102) మంగళవారం మృతిచెందిందని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. ఇటీవల లక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ చనిపోయిందని పేర్కొన్నారు.

ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

● ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు 20 మంది ప్రయాణికులకు గాయాలు ● బస్సు వేగమే ప్రమాదానికి కారణం



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు



అంబులెన్స్‌లో క్షతగాత్రుల తరలింపు

తిమ్మాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధాన్యంలోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు ఆర్టీసీ బస్సులోని 20 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణికుంట వద్ద రాజీవ్‌రహదారిపై మంగళవారం ఉదయం 4.50 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. తిమ్మాపూర్ మండలం నేదునూర్ గ్రామానికి చెందిన ఎలుగందుల రవీందర్ ధాన్యం బస్తాల లోడుతో ట్రాక్టర్‌ను రైస్ మిల్లుకు తరలిస్తున్నాడు. రాజీవ్ రహదారిపై రేణికుంట వద్ద జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తుండగా ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ రోడ్డు పక్కన పల్టీకొట్టింది. ట్రాక్టర్ డ్రైవర్ దూకేయడంతో గాయాలతో బయటపడ్డాడు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 31 మంది ప్రయాణికులు ఉండగా డ్రైవర్‌తో పాటు బస్సులో ప్రయాణిస్తున్న 20 మందికి గాయాలైనట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రమాదానికి ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ప్రయాణికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలాన్ని కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్ కుమార్, తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్ పరిశీలించారు.

అక్కాచెల్లెళ్లపై దాడి

● నిందితుడి రిమాండ్

మల్యాల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): డీజేతో ఇబ్బందులు పడుతుండడంతో సౌండ్ సిస్టం నిలిపివేయాలని అన్నందుకు అక్కాచెల్లెళ్లపై దాడికి పాల్పడిన రాజు అనే యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. గత నెల 30న మల్యాలకు చెందిన రుద్రవేణి నర్సయ్య చిన్న కొడుకు సంజీవ్ వివాహం జరిగింది. అనంతరం నర్సయ్య, అతడి తమ్ముడు పోచయ్య ఇళ్ల మధ్య గల సందులో డీజే పెట్టి నృత్యాలు చేశారు. దీంతో పోచయ్య ఇద్దరు కూతుళ్లు, నర్సయ్య మరో కొడుకు రాజును బాక్సులు తీయమని, తమకు అసౌకర్యంగా ఉందని కోరారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య గొడవ జరగ్గా ఆదివారం రాజు, అతడి కుటుంబ సభ్యులు కలిసి తన చిన్నాన్న పోచయ్య ఇంటికి వెళ్లి అక్కాచెల్లెలపై దాడి చేయడంతో తీవ్రగాయాల పాలయ్యారు. ఇందులో ఒకరు గర్భిణీ కాగా బాధితుల ఫిర్యాదు మేరకు రాజు, అతడి కుటుంబ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం రాజును రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వేధిస్తోందని రాస్తారోకో



మెట్‌పల్లిలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థినులు

మెట్‌పల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాధురి వేధిస్తోందని మంగళవారం విద్యార్థినులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ మీకు తిండి దండగ.. చదువుకు పనికిరారని అంటూ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాటలతో వేధిస్తోందని ఆరోపించారు. వెంటనే ఆమెను విధుల నుంచి తొలగించాలని విద్యార్థినులు డిమాండ్ చేశారు. రహదారిపై ట్రాఫిక్‌జామ్ కావడంతో పోలీసులు విద్యార్థినులకు నచ్చజెప్పినా వినకపోవడంతో ఆర్‌ఓ పూర్ణచందర్‌కు సమాచారం అందించారు. ఆర్‌ఓ సంఘటనా స్థలానికి వచ్చి విద్యార్థినులను సముదాయించే ప్రయత్నం చేసినా వినకపోవడంతో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాధురి సెలవు పెట్టి కళాశాల నుంచి వెళ్లిపోయారు. దీంతో ఆందోళన విరమించారు.

రెస్టారెంట్లపై మున్సిపల్ అధికారుల దాడులు

కోరుట్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని రెస్టారెంట్లు, స్వీట్ హోం, హోటల్స్‌పై మంగళవారం మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. రెస్టారెంట్ల, స్వీట్ హోం, హోటల్స్‌లో నిలువ ఉన్న ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొని జరిమానా విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆశోక్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మహేష్, రికార్డు అసిస్టెంట్ జగదీష్, వార్డు ఆఫీసర్లు హేమంత్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

గన్నేరువరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు తెగిపడి విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందింది. మండల కేంద్రానికి చెందిన రైతు బండపల్లి మనోహర్‌కు చెందిన పాడిగేదెను మంగళవారం తన వ్యవసాయ పొలం వద్ద కట్టివేయగా అక్కడే విద్యుత్ స్తంభానికి లూజుగా ఉన్న విద్యుత్ తీగలు తెగి గేదెపై పడడంతో తన గేదె మృతి చెందినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. జీవనాధారమైన గేదె మృతి చెందడంతో 70 వేల రూపాయల ఆర్థిక నష్టంతో పాటు బతుకుదెరువు పోయిందని విద్యుత్ శాఖ అధికారులు తనను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

అదృశ్యమైన వృద్ధుడి మృతదేహం లభ్యం

కోనరావుపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : అదృశ్యమైన వృద్ధుడు బద్దెపూరి నారాయణ(80) మల్కపేట రిజర్వాయర్‌లో మంగళవారం శవమై కనిపించాడు. కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన బద్దెపురి నారాయణ అక్టోబరు 31న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుమారుడు నవంబరు 3వ తేదీన తన తండ్రి కనిపించడం లేదని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని తెలిపారు. కాగా మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. మంగళవారం కుటుంబ సభ్యులకు మల్కపేట రిజర్వాయర్ నీటిలో ఒడ్డుకు శవంలా కొట్టుకువచ్చి కనిపించగా పోలీసులకు సమాచారం అందించారన్నారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మతిస్థిమితం లేదని, ఈతరాక అందులో పడి చనిపోయి ఉండవచ్చని, తమకు ఎవరిపైనా అనుమానం లేదని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు.

తేనెటీగల దాడిలో ఇద్దరు రైతులకు గాయాలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తేనెటీగలు దాడి చేసిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లిలోని రైతులు కొప్పుల రవీందర్‌రెడ్డి, కుందనపల్లి రవీందర్‌రెడ్డి మంగళవారం తీవ్ర గాయాల పాలయ్యారు. వారిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కుందనపల్లి రవీందర్‌రెడ్డి తన వ్యవసాయ పొలంలోని వ్యవసాయ బావి చుట్టూ ఉన్న చెట్లను జేసీబీ వాహనంతో తొలగించే పనులను చేపట్టాడు. మామిడి చెట్టుకు ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా కుందనపల్లి రవీందర్‌రెడ్డితో పాటు అక్కడే ఉన్న కొప్పుల రవీందర్‌రెడ్డిపై దాడి చేశాయి. భయంతో జేసీబీ డ్రైవర్, మరో వ్యక్తి వాహనంలో అద్దాలను వేసుకోవడం వల్ల ప్రమాదం తప్పినట్లయింది. కొప్పుల రవీందర్‌రెడ్డి పరిస్థితి విషమంగా మారడంతో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఏసీబీ తనిఖీలపై దేవాదాయశాఖ ఆరా..

వేములవాడ టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గతంలో వేములవాడ రాజన్న ఆలయంలో ఏసీబీ తనిఖీల వ్యవహారంపై రాష్ట్ర దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఆరా తీశారు. ఆలయంలో 2024 ఆగస్టులో జరిగిన ఏసీబీ తనిఖీలకు సంబంధించి కార్యనిర్వహణ అధికారిగా ఉన్న వినోద్‌రెడ్డిని బదిలీచేసి, మిగతా ఉద్యోగులకు నోటీసులు జారీ చేశారు. రాజన్న ఆలయంలో 15 మాసాల క్రితం జరిగిన ఏసీబీ తనిఖీల వ్యవహారం మరోసారి వెలుగులోకి రావడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది.

ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యాయత్నం

● ప్రిన్సిపాల్ కొట్టాడని మనస్థాపం ● పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాల బైఠాయింపు

జమ్మికుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రిన్సిపాల్ కొట్టాడని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన ఇద్దరు తొమ్మిదవ తరగతి విద్యార్థులు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని స్వామి వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన జరుగగా మంగళవారం ఉదయం వెలుగు చూసింది. కరీంనగర్ జిల్లా వీణవంక మండల కేంద్రానికి చెందిన చరణ్‌కుమార్, రామ్‌చరణ్ జమ్మికుంటలోని ఎస్వీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నారు. ఆదివారం హాస్టల్ టెర్రస్‌పై చరణ్‌కుమార్, రామ్‌చరణ్‌తో పాటు మరొక స్నేహితుడు సిగరేట్ తాగుతున్నట్లు గమనించిన వార్డెన్ మరుసటి రోజు సోమవారం ప్రిన్సిపాల్‌కు విషయం చెప్పింది. ప్రిన్సిపాల్ విద్యార్థులను పిలిచి చేయి చేసుకుని గట్టిగా మందలించాడు. మీ తల్లిదండ్రులకు చెప్పి టీసీ ఇప్పించి స్కూల్ నుంచి పంపిస్తానని హెచ్చరించాడు. ముగ్గురు విద్యార్థుల్లో ఒకరు పాఠశాలలో చెప్పాపెట్టకుండా ఇంటికి వెళ్లిపోయాడు. మనస్థాపం చెందిన చరణ్‌కుమార్, రామ్‌చరణ్ బయటకు వెళ్లి గడ్డి మందు తెచ్చుకుని హాస్టల్‌లోనే ఓ గ్లాసు నీళ్లలో కలుపుకుని తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. విషయం తెలుసుకున్న పాఠశాల యాజమాన్యం చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ ఆసుపత్రికి చేరుకుని విచారణ చేపట్టారు. పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాల నాయకులు బైఠాయించి ఆందోళనకు దిగారు. పాఠశాల యాజమాన్యంతో పాటు ప్రిన్సిపాల్, వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హుజూరాబాద్ ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పద్మసాయిశ్రీ ఆసుపత్రికి చేరుకుని విద్యార్థుల నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో హంగామా

చందుర్తి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర చెందిన ఓ కూలీ రోడ్డుపై వెళ్తున్న వాహనదారులపై దాడికి యత్నిస్తూ హంగామా సృష్టించాడు. ఈ సంఘటన చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసుల, స్థానికుల కథనం ప్రకారం.. మర్రిగడ్డ గ్రామంలో మహారాష్ట్రకు చెందిన కూలి పనిచేసే కలబండే పండిత్ అనే వ్యక్తి మద్యం మత్తులో ప్రధాన రహదారిలో వెళ్లే వాహనదారులతో పాటు నడుచుకుంటూ వెళ్లే వారిపై దాడికి యత్నించాడు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకొని పండితును అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పండిత్‌ను పనిచేస్తున్న సంబంధిత యజమానికి అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్‌ల పట్టివేత

కరీంనగర్ క్రైం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుం డా కరీంనగర్ రూరల్ మండలంలో ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బొమ్మకల్ శివారులోని మానేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. డ్రైవర్లపై కేసు నమోదు చేశామన్నారు.

వీణవంక : మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పోలీసులు పట్టుకు న్నారు. మానకొండూరు మండలం వేగురుపల్లి, ఊటూరు గ్రామాలకు చెందిన బుర్ర అరవింద్, కోట సంపత్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి



రౌతు గంగాధర్ (ఫైల్)

జగిత్యాలరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల అర్బన్ మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన రౌతు గంగాధర్ అలియాస్ ఆలూరి రెడ్డి (35) అనే యువకుడు నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలంలోని పడకాల గ్రామంలో అనుమానాస్పదస్థితిలో మంగళవారం మృతిచెందాడు. రౌతు గంగాధర్ గ్రామంలో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. ఇటీవలే నిజామాబాద్ జిల్లాలోని వేల్పూర్ మండలంకు పని నిమిత్తం వెళ్లాడు. ఈ క్రమంలోనే గంగాధర్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. శరీరంపై తీవ్రగాయాలు ఉండటం వల్ల మృతుడి బంధువులు యువకుడి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి సోదరుడు శేఖర్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నదిలో గల్లంతైన సాయికృష్ణ మృతదేహం లభ్యం

● అన్నారం బ్యారేజీ నీటి ప్రవాహంలో గుర్తింపు



సాయికృష్ణ (ఫైల్)

మంథని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మంథని గోదావరినదిలో గల్లంతైన రావికంటి సాయికృష్ణ (30) అనే యువకుడి మృతదేహం భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అన్నారం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహంలో మంగళవారం తేలింది. స్థానిక పాత బస్టాండ్ ఏరియాకు చెందిన సాయికృష్ణ సోమవారం ఉదయం మంథని గోదావరి నదిలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటి ప్రవాహంలో మునిగిపోయారు. కుటుంబ సభ్యుల సమాచారంతో పోలీసు, ఫైర్, రెవెన్యూ, మున్సిపల్ శాఖ అధికారులు సోమవారం సాయంత్రం వరకు మంథని నది తీరంలో గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. మంగళవారం అన్నారం బ్యారేజీ వద్ద గుర్తు తెలియని శవం తేలిందని సమాచారంతో పోలీసు, ఫైర్, కుటుంబ సభ్యులు అక్కడి వెళ్లి చూసి సాయికృష్ణగా గుర్తించారు. మంథని ఎస్ఐ-2 సాగర్, ఫైర్ ఆఫీసర్ శివశంకరప్రసాద్, భూపాలపల్లి ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌లు సాయికృష్ణ మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని రాత్రి మంథనికి తరలించారు. మృతదేహం లభ్యమైనట్లు సమాచారం అందటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్వగ్రామానికి చేరిన గల్ఫ్ కార్మికుడి మృతదేహం



సతీష్ (ఫైల్)

రుద్రంగి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన ఓ కార్మికుడు గుండె పోటుతో మృతిచెందగా, మంగళవారం అతడి మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన మర్రిపల్లి సతీష్(38) అనే వ్యక్తి ఉపాధి కోసం మస్కట్ దేశం వెళ్లాడు. నాలుగు రోజుల క్రితం గుండెపోటు రావడంతో మరణించాడు. మృతుడికి భార్య లావణ్య, కూతురు, కూమారుడు ఉన్నారు.

ధర్మపురిలో ఘనంగా గోదావరి హారతి



ధర్మపురి వద్ద గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 14వ రోజు మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, శారదా మహిళా మండలి సభ్యులు, మహిళలు మంగళ వాయిద్యాలు వెంటరాగా సాయంత్రం గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి నది వద్ద విశేష పూజలు నిర్వహించారు. రాత్రి వేళలో మహిళలు దొప్పలో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, సూప రింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివా సాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, ఆలయ అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, రాజగోపాల్, ధర్మకర్తలు రాపర్తి సాయికిరణ్, ఒజ్జల సౌజన్యనరేందర్, స్తంభంకాడి గణేష్, గుడ్ల రవీందర్, పాల్గొన్నారు.



గోదావరిలో కార్తీక దీపాలు వదులుతున్న మహిళలు

రాజన్న భక్తులకు రక్షణేది?

- కార్తీక మాసంలో భక్తుల రద్దీ
- క్యూలైన్లలో తోపులాటలు..
- జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసుల లేఖ



బద్దిపోచమ్మ ఆలయం క్యూలైన్‌లో కిక్కిరిసిన భక్తజనం

వేములవాడ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజేశ్వరస్వామి దేవాలయంలో భక్తు లకు రక్షణేదనే సందేహం నెలకొంది. రాజన్న సన్నిధిలో విస్తరణ పనుల నేపథ్యంలో కార్తీకమాసం సందర్భంగా ఆలయంలో స్వామివారి లఘు దర్శనం కల్పించారు. అనుబంధ దేవాలయమైన భీమేశ్వరాల యంలో ఆర్జిత పూజలు కొనసాగుతున్నాయి. మరో వైపు బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయంలోనూ రద్దీ నెలకొంటోంది. శుక్ర, ఆది, సోమ వారాల్లో భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించు కుంటున్నారు. శ్రీ భీమేశ్వరాల యంలో ఆర్జిత పూజలు, కోడెల మొక్కులు కొనసా గుతున్నందున భక్తుల తాకిడి పెరిగింది. కోడెల క్యూలైన్‌లో భక్తులు తోసుకోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. భక్తుల మధ్య వాగ్వాదం ఏర్పడు తోంది. సోమవారం అర్జిత సేవ అయిన కల్యాణం టికెట్ల కోసం వేచిఉన్న భక్తులు ఒక్కసారి తోసుకోవ డంతో క్యూలైన్ స్టీల్ బారికేడ్స్ వంగిపోయాయి. మంగళవారం బద్దిపోచ మ్మ అమ్మవారికి బోనం సమర్పించేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులకు గుర య్యారు. రానున్న రోజుల్లో భక్తులు అధికసంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. రాబోయే సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా వేములవాడ భక్తజన సందోహంతో నిండిపోనుంది. దీంతో రాజన్న సన్నిధికి వచ్చే భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది.

- ముందస్తు జాగ్రత్తలపై పోలీసుల లేఖ

కార్తీక మాసం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి వచ్చే భక్తులకు తగిన భద్రత ఏర్పాట్లపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఇటీవల ఆలయ ఈవోకు పోలీసులు లేఖ రాశారు. విస్తరణ పనుల దృష్ట్యా ఏదైనా కూల్చివేతలు చేపడితే ముందస్తు సమాచారం ఇవ్వాలని సూచించారు. తమకు తెలియకుండా ఆలయ విస్తరణ పనుల్లో భాగంగా కూల్చివేతలు చేపడితే ఇబ్బందులు తలెత్తుతాయని, ఇటీవల ఆలయంలో ఒక ప్రాంతం కూల్చివేత సందర్భంగా పోలీస్ ఉన్నతాధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా మొదలు పెట్టాలని చూడడంతో వివాదాస్పదమైంది. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకూడదని పోలీసు అధి కారులు హెచ్చరించినట్లు తెలిసింది. ఆలయంలో ఏదైనా సంఘటనలు జరిగితే బాధ్యులు ఎవరని ప్రశ్నించినట్లు సమాచారం. కార్తీకమాసం సంద ర్భంగా రాజరాజేశ్వరాలయం, భీమేశ్వరాల యంలోనూ కిటకిటలా డుతున్నాయి. ఈ సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులు లేఖ రాశారు. ప్రధానంగా క్యూలైన్‌లో వ్యతిరేక దిశలో ప్రవేశించకూడదు. ముందు, వెనుక ఉన్న భక్తులు నెట్టకుండా ఉండాలి. క్యూలైన్లలో పరుగులు తీయడం, తోసుకోవడం చేయకుండా భక్తులు వెళ్లాలి. క్యూలైన్‌లలో రద్దీగా ఉన్నపుడు భక్తులు సహనంతో వేచిఉండాలి. క్యూలైన్‌ల వద్ద డ్యూటీలో ఉన్న సిబ్బంది సూచనలు, సలహాలు పాటించాలి. రద్దీ ప్రదేశాల్లో భక్తులు గుంపులుగా ఉండకూడదు. ఏదైనా తొక్కిసలాట, తోపులాటల పరిస్థితులు ఉంటే వెంటనే భక్తులు దూరంగా వెల్లాలి.



కల్యాణం టికెట్ల కౌంటర్ వద్ద ఒరిగిన క్యూలైన్ స్టీల్ బారికేడ్స్

కల్యాణం టికెట్ కౌంటర్ మార్చుతాం..

- ఆలయ ఈఈ రాజేష్

భీమేశ్వరాలయంలోని కల్యాణం టికెట్ బుకింగ్ కౌంటర్ మార్చుతాం. సోమవారం భక్తులు తోసుకోవడాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రచార రథం వైపు బుకింగ్ కౌంటర్ మార్చడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. మెయిన్ టెంపుల్ క్యూలైన్‌ను పటిష్టం చేస్తాం. భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటే వెంటనే చర్యలు తీసుకుంటాం.

7న సీనియర్ వాలీబాల్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి సీనియర్ వాలీబాల్ ఎంపిక పోటీలను ఈ నెల 7న కొత్తపల్లి మండలం ఎలగందులలో నిర్వహించనున్నట్లు వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ వేణు కిషన్‌రావు, గిన్నె లక్ష్మణ్ తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచినవారిని ఈ నెల 13 నుంచి 16 వరకు మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లాలోని వేముల మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశా లలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీనియర్ వాలీబాల్ పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్‌కార్డుతో ఈ నెల 7న మధ్యాహ్నం 2 గంటలకు హాజరుకావాలని, వివరాలకు 8099546565, 7901000546 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ వద్ద బస్సు, ట్రాక్టర్ ప్రమాద ఘటనపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆరా తీశారు. మణిపూర్ పర్యటనలో ఉన్న ఆయన విషయం తెలిసిన వెంటనే కలెక్టర్, ప్రభుత్వాస్పత్రి వైద్యులు, తిమ్మాపూర్ పోలీసులతో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రయాణికుల భద్రతపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.



సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన వ్యాపారులు

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

ముత్తారం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడుతాయని ఎస్‌ఐ రవి కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని అడవిశ్రీరాంపూర్ చౌరస్తాలో ఆర్‌ఎంపీలు, వ్యాపారుల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం ప్రారంభించారు. ఒక సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమన్నారు. ఏదైనా నేరం జరిగితే నిందితులను త్వరగా గుర్తించి, శిక్షించవచ్చని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. వ్యాపారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. హెడ్‌కానిస్టేబుల్ దేవేందర్, కానిస్టేబుళ్లు రాజ్ కుమార్, వెంకటరెడ్డి, హోంగార్డు రాజు, సీసీ కెమెరాల దాతలు తాటిపాముల శంకర్, హుస్సేన్, రాజేందర్, కుమార్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

వీణవంక, నవంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్ముక్ల తెలంగాణ ఆదర్శ విద్యార్థులు హుజూరాబాద్ బాయ్స్ హైస్కూల్‌లో నిర్వహించిన ఎస్జీఎఫ్ ఉమ్మడి జిల్లా స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రిన్సిపాల్ మోయిజ్‌బాగ్ తెలిపారు. అండర్ 14 విభాగంలో శ్రీచందన, అండర్17 విభాగంలో హర్షిక ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ వేణుగోపాల్ తెలిపారు. వీరు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

కొండగట్టులో భక్తుల పూజలు



కొండగట్టులో భక్తులు

మల్యాల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. వేలాదిగా ముఖ్యంగా ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లా నుంచి వచ్చిన భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనం చేసుకున్నారు. సమ్మక్క సారలమ్మ జాతరకు రెండు నెలల ముందే వివిధ ఆలయాలను సందర్శించి, జాతర సమయంలో సమ్మక్క, సారక్కను దర్శించుకుంటారు. ఇందులో బాగంగానే కొండగట్టులో మంగళవారం రోజంతా భక్తులతో రద్దీ నెలకొంది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. ఘాట్ రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిపి ఉంచడంతో రాకపోకలకు తీవ్ర అసౌకర్యం ఏర్పడింది.

ధర్మపురిలో వైభవంగా తులసీ కల్యాణం



ధర్మపురిలో తులసీ కల్యాణం జరుపుతున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో తులసీ కల్యాణం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం నుంచి అర్చకులు ఉత్సవ మూర్తులను శేషప్ప కళావేదికపై తీసుకవచ్చారు. అనంతరం అందంగా పూలతో అలంకరించిన రుక్మిణి, సత్యభామ సహిత వేణుగోపాల స్వామివారలకు శాస్త్రోక్తంగా కళ్యాణం చేయించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

7న 'శాతవాహన' స్నాతకోత్సవం

- ముఖ్య అతిథులుగా ఛాన్స్‌లర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, హెచ్‌సీయూ వీసీ బీజే రావు
- విద్యార్థులకు 161 బంగారు పతకాలు, 25 పీహెచ్‌డీ పట్టాల పంపిణీ



మాట్లాడుతున్న శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేశ్‌కుమార్



స్నాతకోత్సవానికి జరుగుతున్న ఏర్పాట్లు

గణేశ్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం రెండో స్నాతకోత్సవాన్ని ఈ నేల 7న నిర్వహించనున్నామని ఉప కులపతి యు ఉమేష్‌కుమార్ తెలిపారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కులపతి, గవర్నర్‌జిష్ణుదేవ్‌వర్మ, హైదరాబాద్ కేంద్రియ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య బీజే రావు హాజరు కానున్నారని తెలిపారు. ఈ సందర్భంగాద వర్సిటీ ఆవరణలోని క్రీడా మైదానంలో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయం పరిధిలో ప్రతిభ కనబర్చిన 161 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 25 మంది విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టాలు అందజేయనున్నాట్లు తెలిపారు. బంగారు పతకాలు, పీహెచ్‌డీ పట్టాలు అందుకునే విద్యార్థులు తమ పేర్లు, మొబైల్ నంబరు, ఫొటో, ఈమెయిల్ ఐడీలను విశ్వవిద్యాలయ వెబ్సైట్లో నమోదు చేసుకోవాలన్నారు. దాని ఆధారంగా వేదిక వద్ద వారికి సీట్లు కేటాయిస్తామని తెలిపారు. విద్యార్థులతోపాటు ఒకరి మాత్రమే వర్సిటీలోకి అనుమతి ఉంటుందన్నారు. నవంబరు 7న ఉదయం 10 గంటలకు స్నాతకోత్సవం ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమానికి గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి జిష్ణుదేవ్ వర్మ అధ్యక్షత వహించిన స్నాతకోత్సవ ప్రసంగం చేస్తారన్నారు.

గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్ : శాతవాహన యూనివర్సిటీ స్నాతకోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ముఖ్య అతిథిగా హాజరవుతున్నందున పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలాసత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో అధికారులతో గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గవర్నర్ పర్యటనలో ప్రొటోకాల్ పాటిస్తూ ఎలాంటి ఇబ్బందులు రాకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని, సమయ పాలన పాటించాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. మెడికల్ టీం, 108, 101, ప్రత్యేక డాక్టర్ల బృందం ఏర్పాటు చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సూచించారు. సభావేదిక ఏర్పాట్లను ఆర్‌అండ్‌బీ అధికారులు, తాగునీరు, శానిటేషన్, ఫాగింగ్ వంటి ఏర్పాట్లను మున్సిపల్ అధికారులు చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే స్టాళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు. యూనివర్సిటీలో పూర్తిస్థాయిలో భద్రత ఉంటుందని, ఐడెంటిటీ కార్డులు ఉన్నవారిని మాత్రమే లోనికి అనుమతించాలన్నారు. గేటు వద్ద తనిఖీ కోసం యూనివర్సిటీ తరపున సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు. గవర్నర్ కార్యక్రమానికి హాజరయ్యే వారి పేర్ల జాబితాను ముందే సమర్పించాలన్నారు. శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేశ్‌కుమార్, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాఖడే, లక్ష్మీకిరణ్, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, డీసీపీ వెంకటరామిరెడ్డి ఉన్నారు.

మళ్లీ తెరుచుకున్న ఎల్‌ఎండీ గేట్లు

- 2గేట్ల ద్వారా 4వేల క్యూసెక్కుల నీటి విడుదల



ఎల్‌ఎండీ నుంచి విడుదలవుతున్న నీరు

తిమ్మాపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో ఈ సీజన్‌లో ఎల్‌ఎండీ గేట్లు తరచుగా ఎత్తుతున్నారు. తుఫాను ప్రభావంతో రెండు రోజుల క్రితం తెరచి ఉన్న ఎల్‌ఎండీ స్పీల్‌వే గేట్లు అధికారులు మూసివేశారు. సోమవారం అర్ధరాత్రి నుంచి ఎగువన కురుస్తున్న వర్షాలతో మోయతుమ్మెద వాగు నుంచి ఎల్‌ఎండిలోకి ఇన్‌ఫ్లోలు పెరుగడంతో మంగళవారం మధ్యాహ్నం రెండు గేట్లు ఎత్తి 4వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. ఎల్‌ఎండీలోకి మోయతుమ్మెద వాగు నుంచి 4,254క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. రెండు స్పీల్‌వే గేట్ల నుంచి 4వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో కలిసి 254క్యూసెక్కులు మొత్తం 4,254 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉన్నది.

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద



జగిత్యాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు రావడం మంగళవారం తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతం నుంచి 28,204 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 6 వరద గేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి 18,750 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతర ములకు కలిపి ప్రాజెక్టు నుంచి 28,204 క్యూసెక్కుల నీటిని వదులుతు న్నారు. ఇందులో ఎస్కేప్ గేట్ల ద్వారా 8 వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 573 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.

రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ



వేములవాడలో భక్తులు



బద్దిపోచమ్మ ఆలయంలో బారులు తీరిన భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం కార్తీక సందడి నెలకొంది. మంగళవారం ఉదయం వర్షంలోనూ స్వామివారి లఘు దర్శనానికి బారులు తీరారు. వర్షంలోనూ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వరాలయంలో భక్తులు కోడె మొక్కులు చెల్లించి ఆర్జిత సేవలైన కల్యాణం, సత్యనారాయణ వ్రతం, కుంకుమ పూజలు, ఇతర పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు.

బద్దిపోచమ్మ ఆలయంలో ..

బద్దిపోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. మంగళవారం వేములవాడ పట్టణంలోని బద్దిపోచమ్మ ఆలయంలో వేలాదిమంది భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు భక్తులకు రెండుగంటల సమయం పట్టింది. క్యూలైన్‌లో భక్తులు కిక్కిరిసిపోయారు. ఒక్కసారిగా బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయానికి వేలాదిమంది భక్తులు చేరుకోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. అయితే ఎప్పటికప్పుడు ఆలయ సూపరింటెండెంట్ రాజు, ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రావు పర్యవేక్షించారు.

నేడు భీమేశ్వరాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు

రాజరాజేశ్వరస్వామి అనుబంధ దేవాలయమైన భీమేశ్వరాలయంలో బుధవారం కార్తీకపౌర్ణమి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బుధవారం సాయంత్రం ఆరు గంటలకు భీమేశ్వరస్వామివారికి, భీమేశ్వర సదన్ పరిసర ప్రాంతంలో సామూహిక దీపారాధన నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని ఇన్‌చార్జి ఈవో రాజేశ్ తెలిపారు.

బాక్సింగ్, కబడ్డీలో విద్యార్థుల ప్రతిభ

- రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణిస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు
- జాతీయ స్థాయిలో పాల్గొనాలనే లక్ష్యంతో సాధన





నార్మల రజిత



పుల్లె సాగరిక



మొగిలి సింధూజ

మంథనిరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలలో ప్రతిభ చాటుతూ జాతీయ స్థాయిలో రాణించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నారు. మండలంలోని ఎక్లాసుపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు బాక్సింగ్, కబడ్డీలో మహిళల విభాగంలో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటుతున్నారు. వారిలో ఉన్న ప్రతిభను గుర్తించిన పాఠశాల పీడీ డాక్టర్ దోమటి రవి ప్రోత్సాహంతో జాతీయ స్థాయిలలో పాల్గొనాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నారు. పాఠశాలలో 9వ తరగతి ఇంగ్లీష్ మీడియం చదువుతున్న నార్మల రజితకు బాక్సింగ్‌పై ఆసక్తి ఉండటంతో ఆమెకు శిక్షణ ఇవ్వడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో జరిగిన అండర్-17 మహిళల 48 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. సెప్టెంబరులో హన్మకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని ప్రతిభ చాటింది. బాక్సింగ్‌లో మెలకువలు నేర్చుకొని జాతీయ స్థాయిలో పాల్గొనాలనే లక్ష్యంతో కష్టపడి సాధన చేస్తున్నట్లు రజిత తెలిపింది. ఇదే పాఠశాలకు చెందిన పుల్లె సాగరిక పదో తరగతి ఇంగ్లీష్ మీడియం చదువుతోంది. కబడ్డీలో ప్రతిభ చాటుతూ జిల్లాస్థాయిలో రాణించి ఈనెల 8, 9, 10 తేదీలలో భద్రాది కొత్తగూడెంలో జరగనున్న అండర్-17 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. సాగరిక గత సంవత్సరం జరిగిన రాష్ట్ర స్థాయి సీఎం కప్ కబడ్డీ పోటీలలో పాల్గొంది. జాతీయ స్థాయిలో రాణించాలనే లక్ష్యంతో ప్రాక్టీస్ చేస్తున్నట్లు తెలిపింది. పాఠశాలలో 9వ తరగతి ఇంగ్లీష్ మీడియం చదువుతున్న మొగిళి సింధూజ కబడ్డీలో రాణించి జిల్లా స్థాయిలో ప్రతిభ చాటడంతో గత నెలలో సంగారెడ్డి జిల్లాలో జరిగిన అండర్-14 మహిళల విభాగంలో కబడ్డీ పోటీలో పాల్గొంది. జాతీయ స్థాయిలో పోటీలలో పాల్గొనడానికి కృషి చేస్తానని సింధూజ తెలిపారు.

విద్యార్థుల ఇష్టంతోనే శిక్షణ

-పీడీ డాక్టర్ దొమ్మటి రవి



గత సంవత్సరం పాఠశాలకు బదిలీపై వచ్చాను. విద్యార్థులకు కబడ్డీ, బాక్సింగ్ పై ఆసక్తి ఉండటంతో వారికి ప్రత్యేకంగా రోజు శిక్షణ ఇస్తున్నా. శిక్షణను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు క్రీడల్లో తమ ప్రతిభను చాటుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు. కష్టపడి సాధన చేస్తే జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొంటారు.

పనులు ప్రారంభించని ఇందిరమ్మ ఇళ్ల రద్దు

(3వ పేజీ తరువాయి)

మార్కవుట్ చేసిన తర్వాత రోజు నుంచి 45 రోజుల వరకు పనులు ఆరంభించకుంటే ఆ ఇళ్లను రద్దు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం ఆరంభించిన తర్వాత మొదటి విడత ఈ ఏడాది జనవరి 31న మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. సర్వేలో అర్హులైన వారిని గుర్తించి ఆ గ్రామంలో పూర్తి స్థాయిలో ఇళ్లను మంజూరు చేశారు. అందులో భాగంగా ధర్మారం మండలం బంజేరుపల్లి, కమాన్‌పూర్ మండలం రొంపికుంట, ముత్తారం మండలం మచ్చుపేట, రామగిరి మండలం రత్నాపూర్, ఎలిగేడు మండలం శివపల్లి, జూలపల్లి మండలం కోనరావుపేట, ఓదెల మండలం పొత్కపల్లి, పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి, కాల్వశ్రీరాంపూర్ మండలం అం కంపల్లి, సుల్తానాబాద్ మండలం కట్టుపల్లి, అంతర్గాం మండలం మద్దిర్యాల, పాలకుర్తి మండలం రామారావుపల్లి, మంథని మండలం అడవి సోమన్‌పల్లి గ్రామాలను ఎంపిక చేసి 1951 ఇళ్లు మంజూరు చేశారు. ఎనిమిది మాసాల వరకు కూడా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను చేపట్టకపోవడంతో ఆ ఇళ్లను ఇటీవల రద్దు చేశారు. బంజేరుపల్లిలో 33 ఇళ్లు, రొంపికుంటలో 127 ఇళ్లు, మచ్చుపేటలో 11 ఇళ్లు, రత్నాపూర్‌లో 171 ఇళ్లు, శివపల్లిలో 47 ఇళ్లు, కోనరావు పేటలో 106 ఇళ్లు, పొత్కపల్లిలో 177 ఇళ్లు, నిమ్మన పల్లిలో 93 ఇళ్లు, అంకం పల్లిలో 79 ఇళ్లు, కట్నపల్లిలో 86 ఇళ్లు, మద్దిర్యాలలో 35 ఇళ్లు, రామా రావుపల్లిలో 52 ఇళ్లను రద్దు చేసినట్లు జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ రాజే శ్వర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. వాటి స్థానంలో పట్టణ ప్రాంతాల్లో అర్హులైన వారికి ఇళ్లను మంజూరు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

భవిత సెంటర్లను సమర్థవంతంగా నిర్వహించాలి

పెద్దపల్లి కల్చరల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ విద్యార్థులు చదువుకునే భవిత సెంటర్లను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజతో కలిసి భవిత సెంటర్ నిర్వహణపై అధికారులతో సమీక్ష చేశారు. ఆయా సెంటర్లలో ఉన్న విద్యార్థుల సంఖ్య, వసతులు, మరమ్మతుల వివరాలను తెలుసుకున్నారు. భవిత సెంటర్‌లో చేపట్టిన పనులను ఈనెల 20లోగా పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉందని, ప్రతి కేంద్రం దగ్గర సంఖ్య పెంచేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. రోజు విద్యార్థుల కార్యకలాపాలు, హాజరు శాతం అందించాలని తెలిపారు. ప్రతి సెంటర్‌కు రూ.5 నుంచి రూ.10 లక్షల ఖర్చుతో బాగు చేస్తున్నామని, దివ్యాంగుల్లో నైపుణ్యాలు మార్కు కని పించేలా బోధన చేయాలన్నారు. కోఆర్డినేటర్ మల్లేష్, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పనులు పూర్తి చేయాలి

పెద్దపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద చేపట్టిన మౌలిక వసతుల కల్పన పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్‌లో మంథని, సుల్తానాబాద్, గోదావరి ఖని, ఓదెల, ధర్మారం, శ్రీరాంపూర్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద తాగు నీటి సరఫరా, విద్యుత్, పారిశుధ్య పనులు డిసెంబర్ 15 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రామగుండంలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద సివరేజ్, సెప్టిక్ ట్యాంక్, తాగునీరు, విద్యుత్ సరఫరా పనులు పూర్తి చేయాలన్నారు. 8 ఇంక్లైన్ కాలనీలో అసంపూర్ణంగా వివిధ దశల్లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను లబ్ధిదారులు నిర్మించుకునేలా అలాట్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పీడీ హౌసింగ్ రాజేశ్వర్ రావు, ఆర్అండ్‌బీ ఈఈ బావ్‌సింగ్, రెవెన్యూ డివిజనల్ అధికారి గంగయ్య పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ సందర్శించిన ఇంటర్ బోర్డు ప్రత్యేకాధికారి

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): గర్రెపల్లి మోడల్ స్కూల్‌ను ఇంటర్మీడియట్ బోర్డు ప్రత్యేక అధికారి రమణరావు మంగళవారం సందర్శించారు. మోడల్ స్కూల్ కళాశాలలోని పిల్లల హాజరు, రికార్డులు, ప్రాక్టికల్ ల్యాబ్‌లను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి బోధన విధానాల గురించి అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ గోల్డిబా ల్బీర్ కౌర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

మంథని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న మంగళవారం ప్రకటనలో తెలిపారు. మార్కెట్ కమిటీ పరిధిలోని రైతులు ధాన్యాన్ని కేంద్రంలో విక్రయించాలని సూచించారు.

ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాలు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు రంగంలో యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి రాజశేఖర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో మెప్షన్ కంపెనీ తరఫున జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలు ప్రాంతాల నుంచి అభ్యర్థులు హాజరైనట్లు, ఎంపిక విధానం, ఉద్యోగాలపై వివరించి ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గం

మంథని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మంథని మండల ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అవధాని మోహన్‌శర్మ, ప్రధాన కార్యదర్శిగా చంద్రుపట్ల సుధాకర్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా మారు పాక సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షులుగా పోలోజు సత్య నారాయణ, ఉపాధ్యక్షులుగా ఎరుకల పోశం, కొండేల శ్యామల-మారుతి, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా కక్కెడప రామయ్య, రామడుగు శైలజ, పబ్లిక్ సెక్రెటరీగా బాజామొయినుద్దీన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి నర్సింహారావు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జీవన్‌రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ పెన్షన్ల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 7న హైదరాబాద్‌లో నిరసన దీక్షను చేపట్టనున్నట్లు చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రజమా రాజు, ఉపాధ్యక్షులు దేవేందర్, మారుతిరావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

సుల్తానాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సాఫ్ట్ బేస్‌బాల్ పోటీలకు ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అక్టోబరులో జగిత్యాల జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 10వ తరగతి విద్యార్థి సాయిగణేష్, 9వ తరగతి విద్యార్థి సాత్విక్ ప్రతిభ కనబరిచారు. ఈనెల 7న మహారాష్ట్రలోని షిరిడిలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. పాఠశాల చైర్మన్ సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ అభినందించారు. పీఈటీలు సత్యనారాయణ, శివ, సతీష్, మమత పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపన్యాస, క్విజ్, వ్యాసరచన పోటీలు



కాల్వశ్రీరాంపూర్‌లో విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): టీశాట్, రాష్ట్ర గెజిటెడ్ హెడ్‌మాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో వార్షిక ప్రతిభా పోటీలు మంగళవారం ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఉపన్యాస, క్విజ్, వ్యాసరచన విభాగాల్లో పోటీలు నిర్వహించగా ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. గంగారం జడ్పీహెచ్ఎస్ విద్యార్థి సహస్ర ఉపన్యాసం, పెగడపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థి సాయిహర్షిత వ్యాసరచన, క్విజ్, టాలెంట్ పోటీల్లో నిశాంత్‌లు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. మండల విద్యాధికారి వారిని అభినందించి, ప్రశంసాపత్రాలను అందించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సునీత, రమారం, జగదీశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): టీశాట్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి ప్రతిభా పోటీలను నిర్వహించారు. ఉపన్యాసం, వ్యాసరచన, క్విజ్ పోటీలను చేపట్టారు. ఉపన్యాసంలో అడవిశ్రీరాంపూర్ జడ్పీపాఠశాల విద్యార్థి సిరివెన్నెల, వ్యాసరచనలో ఓడేడు విద్యార్థి రమ్య, క్విజ్‌లో పోతారం విద్యార్థి అభిలాష్ ప్రథమ స్థానాన్ని సాధించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మండల విద్యాధికారి హరిప్రసాద్ ప్రశంసాపత్రాలు, గణితదర్శిని పుస్తకాలు అందజేశారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పద్మావేది, రాజేందర్, సంతోష్ ఉన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హైస్కూల్‌లో క్విజ్, ఉపన్యాస పోటీల్లో పొత్కపల్లి హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. క్విజ్‌లో శ్రీచరణ్, వైష్ణవి, అక్ష రోషన్, లాస్య మొదటి స్థానం, ఉపన్యాస పోటీలో శ్రీనిత్య ప్రథమ, వ్యాస రచన పోటీలో జబీయా మజాజ్ ద్వితీయ సాధించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఎంఈఓ రమేష్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పద్మ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు అమృత కిషోర్, లక్ష్మీ నారాయణ, కుమార్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, సి.ఆర్.పి. ఓంకార్ పాల్గొన్నారు.

ఎలిగేడు,(ఆంధ్రజ్యోతి): మండల స్థాయి ఉపన్యాస, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఉపన్యాస పోటీల్లో విద్యత, వ్యాసరచనలో అక్షయ, ఉపన్యాస పోటీల్లో వెంకట తేజలు ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి ప్రశంసాపత్రాలు అందజేశారు. మండల విద్యాధికారి ఆనసూరి నరేంద్ర చారి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం గుండ దేవేందర్ రావు, హెచ్ఎంలు బిజిలి సదయ్య, గంగారెడ్డి, శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఓం ప్రకాష్, సీఆర్‌పీ లక్ష్మినారాయణ, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



ధర్మారంలో ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జ్ఞానాన్ని పరిశీలించడానికి క్విజ్ పోటీలను ఉపయోగకరంగా ఉంటాయని మండల విద్యాధికారి వి. ప్రభాకర్ అన్నారు. ధర్మారం ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ప్రతిభ పోటీలు నిర్వహించారు. ఉపన్యాసంలో కొత్తూరు పాఠశాల విద్యార్థి ఎస్.సునంద, వ్యాసరచనలో నందిమేడారం విద్యార్థి పి.ఐశ్విక, క్విజ్‌లో ధర్మారం పాఠశాల విద్యార్థులు కేవీఎం. సుభాషిణిలు మొదటి స్థానాలు సాధించి జిల్లా స్థాయికి అర్హత సాధించారు. హెచ్ఎం శీలతో కలిసి విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. జడ్జీలుగా ఉపాధ్యాయులు కందుకూరి భాస్కర్, కర్రలు వ్యవహరించగా ఉపాధ్యాయులు అంజయ్య, శ్రీధర్‌రెడ్డి, దేవరాజ్, శేషగిరిరావు, సంతోషమ్మలు పర్యవేక్షించారు.

టీపీసీసీ ఎలక్షన్ కమిషన్ కో-ఆర్డినేషన్ కమిటీ మెంబర్‌గా కాచే



మంథని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ఎలక్షన్ కమిషన్ కో-ఆర్డినేషన్ కమిటీ మెంబర్‌గా మంథనికి చెందిన కాంగ్రెస్ నేత, న్యాయవాది శశిభూషణ్‌కాచేను నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజ్ ఆమోదంతో 13 మంది సభ్యులతో ఏర్పాటు చేసిన కమిటీలో శశిభూషణ్ కాచేకు చోటు కల్పించారు. ఇప్పటి వరకు కాచే ఇదే పదవిలో కొనసాగారు. మరోసారి నియమించినందుకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబులకు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌లకు శశిభూషణ్ కాచే ధన్యవాదాలు తెలిపారు.

రెవెన్యూ శిక్షణలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూకు సంబంధించిన విషయాలపై శిక్షణ తీసుకుంటున్నట్లు ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజ తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్దంపేట తహసీల్దార్ గ్రామంలో తొమ్మిదిరోజులుగా రిజిస్ట్రేషన్, ప్రభుత్వ భూముల పరిరక్షణ, సీలింగ్ భూముల పరిశీలన, కార్యాలయంలో రికార్డులు, రెవెన్యూకు సంబంధించిన విషయాలపై శిక్షణ తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. తొమ్మిది రోజులు మండలంలో ప్రస్తుతం కాల్వశ్రీరాంపూర్‌లో శిక్షణ తీసుకుంటున్నట్లు తెలిపారు. తహసీల్దార్ జగదీశ్వర్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ శంకర్, రెవెన్యూ తదితర సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నా...

ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నానని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజ తెలిపారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన తాను ఒకటి నుంచి 7వ తరగతి వరకు మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం లింగాపూర్ చదివానని, 8 నుంచి 10 వరకు ఉన్నతపాఠశాల దండేపల్లిలో అనంతరం ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేసి వరంగల్‌లో పీజీ చేయగా, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా ఉద్యోగం సాధించినట్లు తెలిపారు. యూపీఎస్సీ సాధించాలని పట్టుదలతో హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ప్రభుత్వం నిర్వహించే గ్రూప్ కోచింగ్ తీసుకొని గ్రూప్ 2 అనంతరం గ్రూప్ 1 సాధించానన్నారు. యూపీఎస్సీ సాధించాలని లక్ష్యంతో ఇంకా చదువుకుంటున్నానని తెలిపారు.



వివరాలు సేకరిస్తున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజ

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

పెద్దపల్లి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని డీఎల్‌పీఓ దేవకీదేవి అన్నారు. మంగళవారం రాఘవపూర్, దేవునిపల్లి గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లోని సెగ్రిగేషన్ షెడ్డు, నర్సరీలు, శ్మశానవాటికలను పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు నిర్వహించాలని, చెత్త లేకుండా శుభ్రం చేయించాలన్నారు. దోమల బెడద లేకుండా ఫాగింగ్ చేయించాలన్నారు. కార్యదర్శులు రవి, ఆఫుల అఖిల పాల్గొన్నారు.

ఖని ప్రెస్‌క్లబ్ బాయ్ మృతి

కళ్యాణ్‌నగర్, నవంబర్ 4(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రెస్‌క్లబ్ బాయ్ దస్తగిరి మంగళవారం మృతిచెందారు. 30 ఏళ్లుగా ప్రెస్‌క్లబ్ బాయ్‌గా సేవలందించిన దస్తగిరి కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. శివాజీనగర్‌లోని ఆయన నివాసం వద్ద దస్తగిరి మృతదేహానికి పాత్రికేయులు, రాజకీయ, నాయకులు నివాళులర్పించారు.

నేత్రదాత కుటుంబానికి అభినందన

రామగిరి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కల్వచర్ల గ్రామానికి చెందిన కేతిరెడ్డి రాజేశ్వరి ఇటీవల మృతి చెందగా ఆమె నేత్రలను సదాశయ ఫౌండేషన్‌కు అందజేశారు. మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ నిర్వాహకులు అభినందిస్తూ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు సానంకుశవ్‌రెడ్డి, జాతీయ కార్యదర్శి లింగమూర్తి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మారుతి యాదవ్, డైరెక్టర్ రమణారెడ్డి, పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరసన



ఆందోళన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ శ్రేణులు

మంథని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మంత్రి శ్రీధర్‌బాబు క్యాంపు ఆఫీసు ఎదుట ఎస్ఎఫ్ఐ శ్రేణులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వర్షం సైతం లెక్క చేయకుండా క్యాంపు ఆఫీసు వద్ద ఆందోళనకు దిగారు. రజనీకాంత్, రాజుకుమార్, స్వరన్, ఆర్ల సందీప్, రాజ్‌కుమార్, సాయితేజ, లక్ష్మన్, శశి పాల్గొన్నారు.

పెద్దపల్లి కల్చరల్, (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై నిరసనలు కొనసాగాయి. డిగ్రీ, జూనియర్ కళాశాలలతోపాటు ఇంజనీరింగ్ ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలు బంద్‌లో పాల్గొన్నాయి. నాలుగేళ్లుగా విద్యార్థుల ఉపకార వేతనాల బకాయిలు ఇవ్వడంలో ప్రభుత్వం మొండివైఖరి అవలంభిస్తున్నదని నాయకులు పేర్కొన్నారు. శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, బీఈడీ లెక్చరర్ల అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందించారు. దీనికితోడు విద్యార్థి సంఘాల నాయకులు కూడా కళాశాలలో విద్యార్థులను బాయ్‌కాట్ చేయించడంతో కళాశాలలు బంద్ కొనసాగింది.

మహిళలు వ్యవసాయ ఆధారిత వ్యాపారాల్లో రాణించాలి

పాలకుర్తి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహిళా రైతులు వ్యవసాయ ఆధారిత వ్యాపారాల్లో రాణించాలని, తద్వారా కుటుంబ ఆర్థిక స్థితి బలోపేతం అవుతుందని రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ సతీమణి మనాలి ఠాకూర్ అన్నారు. మంగళవారం పాల కుర్తి మండల కేంద్రంలో పొదుపు సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులంతా పంటల ఉత్పత్తి పెంపుతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర అభినందనీయమన్నారు. మహిళలు తమ ఏకాగ్రత వ్యవసాయ రంగంలో వ్యాపారాల వైపు అడుగులు వేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మనాలి ఠాకూర్

వెంకటాపూర్ పాఠశాలను సందర్శించిన ఎంపీడీవో

మంథనిరూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో తరగతి గదుల కొరతపై ఆంధ్రజ్యోతిలో ఒకే గది పది తరగతులు అనే శీర్షిక సోమవారం కథనం ప్రచురితమైంది. ఎంపీడీవో శ్రీజారెడ్డి మంగళవారం వెంకటాపూర్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ముత్తశాలలు, వంట గదులు, పాఠశాల భవనాన్ని పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యను పాఠశాలలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. గదుల లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. గదులకొరత సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

గర్భిణీల రిజిస్ట్రేషన్ చేయాలి

పెద్దపల్లి, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): గర్భిణీల ఎర్లీ రిజిస్ట్రేషన్ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రీవాణి అన్నారు. మంగళవారం ఆమె చాంబర్‌లో పెద్దపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణీలకు మొదటి రెండు ఆరోగ్య పరీక్షలు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, మూడవ, నాలుగవ పరీక్షలను జిల్లా ప్రధాన ఆసుపత్రి, పెద్దపల్లిలో నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షల కోసం గర్భిణీల తరలింపునకు 102 ప్రభుత్వ వాహన సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఇంటింటి జ్వరాల సర్వే నిర్వహించి, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. దగ్గు, జ్వరం, బరువు తగ్గిన వారికి క్రమవ్యాధి నిర్ధారణ చేయాలని తెలిపారు. అలాగే చిన్నపిల్లలకు డ్యూ లిస్టు ప్రకారం వ్యాధినిరోధక టీకాలు వేయాలని, ఎవరూ వ్యాక్సిన్ డ్యూ లేకుండా చూసుకోవాలని సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్లు ఆరోగ్య కేంద్రాలలో వివిధ వ్యాధుల నిర్ధారణకు అవసరమైన రక్త నమూనాలను సేకరించి, తగిన జాగ్రత్తలతో టీ హబ్ డయాగ్నొస్టిక్ సెంటర్‌కు పంపించాలని ఆదేశించారు. ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కేవీ సుధాకర్ రెడ్డి, అర్బన్ పీహెచ్‌సీ వైద్య అధికారి డాక్టర్ సంయుక్త, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

రామగిరి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యంతో ముందుకు వెళ్లాలని శ్రీసీతారామసేవ సదన్ వక్త నరసింహమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం బేగంపేట్‌ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన గణిత శాస్త్రవేత్త శకుంతలాదేవి జయంతిని పురస్కరించుకొని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం పై మోటివేషన్ క్లాసును ఏర్పాటు చేశారు. సంకల్పబలం గొప్పగా ఉంటే ఎంతటి కఠినమైన సమస్య అయినా సులువుగా సాధించవచ్చన్నారు. ప్రధానోపాధ్యాయురాలు శైలజ, ఉపాధ్యాయులు రాంకిషన్‌రావు, పద్మజ, సీతారాణి, సంపత్‌కుమార్, శ్రీనివాస్, గణపతి, శాండిల్య పద్మవతి పాల్గొన్నారు.

8లోగా రిజిస్ట్రేషన్ పత్రాలు సమర్పించాలి

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): క్రీడా, యువజన సంఘాల రిజిస్ట్రేషన్ పత్రాలు ఈ నెల 8వ తేదీలోగా సమర్పించాలని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి సురేష్ తెలిపారు. క్రీడా, యువజన సంఘాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను కలెక్టరేట్‌లోని యువజన, క్రీడాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. వివరాలకు 9989090097 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

ఎలిగేడు శివాలయంలో రుద్రాభిషేకం

ఎలిగేడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివాలయంలో మంగళవారం వైకుంఠ చతుర్దశి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పరోహితులు శశిశర్మ ఆధ్వర్యంలో లక్ష వత్తుల నోములు, రుద్రాభిషేకం, కార్తీకదీప దాన పూజలు చేశారు. ప్రధాన అర్చకులు దయాకర్ శర్మ, మండల ఆర్యవైశ్య సంఘం మాజీ వ్యవసాయ అధ్యక్షుడు లింగమూర్తి రమాదేవి, ధర్మారం మార్కెట్‌కమిటీ మాజీ డైరెక్టర్ రామచెంద్రఅవధాని పాల్గొన్నారు.

26న చలో ఢిల్లీ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దపల్లి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో ఈనెల 26న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన రాజ్యాంగ హక్కుల సాధన సభను విజయవంతం చేయాలని జాతీయ మాల మహానాడు సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి మధు అన్నారు. మంగళవారం చలో ఢిల్లీ కరపత్రాన్ని ఆవిష్కరించారు. పార్లమెంటుకు అంబేద్కర్ పేరు పెట్టాలని, మాల కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సభను విజయవంతం చేయాలని కోరారు. ఆముల శ్రీనివాస్, నర్సయ్య, గీస రాజు, రామకృష్ణ, రాజన్న, సురేష్, శీలం శంకర్, పాల్గొన్నారు.

మెటీరియల్ సరఫరాకు దరఖాస్తుల ఆహ్వానం

అంతర్గాం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): రామగుండం పట్టణంలోని ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, సివిల్, సీఎన్‌సీ మిషనింగ్ ట్రేడ్లకు అవసరమయ్యే మెటీరియల్‌ను సరఫరా చేసేందుకు కాంట్రాక్టు సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ ఈసారపు సురేందర్ మంగళవారం తెలిపారు. ఆసక్తిగల వారు ఐటీఐలో సంప్రదించాలని సూచించారు.

ఏడాదికోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలి

కళ్యాణ్‌నగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఏడాదికోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని జనరల్ ఫిజీషియన్ హరీష్ అన్నారు. మంగళవారం ఓల్డ్ సీఎస్‌పీలో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న వాయు, జల కాలుష్యంతో వ్యాధులు పెరుగుతున్నాయన్నారు. ఈసీజీ, 2డీ ఎకో, మధుమేహ, బీపీ పరీక్షలను నిర్వహించారు. మెడికవర్ ఆసుపత్రి హెడ్ గుర్రం కిరణ్, మేనేజర్ కోట కరుణాకర్, దివాంగర్‌సింగ్, అనీల్, బొంగోని హరీష్, రమేష్ పాల్గొన్నారు.

పెద్దమ్మ ఉత్సవాలకు విరాళం

సుల్తానాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పెద్దమ్మ ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలకు పదివేల రూపాయలను విరాళంగా ఇచ్చినట్లు మండల సర్పంచ్ ఫోరం మాజీ అధ్యక్షుడు పవల అజయ్‌గౌడ్ తెలిపారు. ఆలయ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలకు ఇచ్చినట్లు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముస్త్యాల శివారు తుమ్మల మల్లారెడ్డి, వేణు పొలాల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ నెల 3న ఉదయం తెల్లవారుజామున పొలాల వద్దకు వెళ్లిన రైతులు చూసే సరికి ట్రాన్స్‌ఫార్మర్ కనిపించకపోవడంతో విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. విద్యుత్‌శాఖ లైన్‌మెన్ రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సింగరేణి సమాచారం

డ్రైవింగ్ శిక్షణ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆధ్వర్యంలో ప్రభావిత ప్రాంతాల యువతకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్జీ-2 ఏరియా ప్రతినిధి, ఏజీఎం అరవిందరావు ప్రకటనలో పేర్కొన్నారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా ప్రభావిత గ్రామాల అభివృద్ధికి సంబంధించిన పర్యావరణ నిర్వహణ, ప్రణాళిక అనుసరించి ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల యువత కోసం శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 18 ఏళ్ల పైబడిన స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చని, శిక్షణ పూర్తిచేసుకున్న తర్వాత లైట్ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ అందజేయనున్నట్లు తెలిపారు. వీర్లపల్లి, మారేడుపాక, విఠలేనగర్, రమేష్‌నగర్, అల్లూరు, పోతనకాలనీ ప్రాంతాలకు చెందిన యువత ఈనెల 7తేదీ వరకు పర్సనల్‌విభాగంలో అందజేయాలని ప్రకటనలో పేర్కొన్నారు.

పదోన్నతి పై వెళ్తున్న ప్రాజెక్టు అధికారికి సన్మానం

రామగిరి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-2 ప్రాజెక్టు అధికారిగా పనిచేసి కొత్తగూడెం ఆర్‌అండ్‌డీ జీఎంగా పదోన్నతిపై వెళ్తున్న సిహెచ్ వెంకటరమణను మంగళవారం జీఎం కార్యాలయంలో సన్మానించారు. జీఎం సుధాకర్‌రావు పాల్గొన్నారు. అధికారులు రామ్మోహన్‌రావు, ప్రవీణ్, పాండింగ్, కోటేశ్వర్‌రావు, జనార్దన్‌రెడ్డి, రాజారెడ్డి, పాల్గొన్నారు.

గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ విఫలం

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సింగరేణి గుర్తింపు కార్మిక సంఘంగా ఏఐటీయూసీ విఫలమైనట్లు ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ఏఐటీయూసీ సాధించింది శూన్యమన్నారు. ప్రాతినిధ్య సంఘంగా ఐఎన్‌టీయూసీ కృషి ఫలితంగా కార్మికులకు న్యాయం జరుగుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక డైరీ క్లాక్ పనులను వేగవంతం చేయడంతో త్వరలో ఉత్పత్తి దశకు చేరుకుందని తెలిపారు. దసరాకు కాంట్రా క్టు కార్మికులకు బోనస్‌గా రూ.5,500 ఇప్పించినట్లు తెలిపారు. మారుపేర్ల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, సాధ్యమైనంత వరకు పరిష్కారం అయ్యేలా యాజమాన్యం పని చేస్తున్నట్లు తెలిపారు. ధర్మపురి, ఆర్థం, శంకర్‌నాయక్, వడ్డెపల్లి దాసు, వికాస్ యాదవ్, కృష్ణ, సదానందం, ఆశోక్, లక్ష్మయ్య, సురేష్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్